క్లుప్తంగా

నిత్యం అందుబాటులో ఉండాలి

మండల ప్రత్యేక అధికారి మురళి



అచ్చంపేట: సచివాలయ సిబ్బంది మొత్తం ప్రజలకు అందుబాటులో ఉండి అంకిత భావంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సచివాలయం-1, కస్తలలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. రెండు సచివాలయాల్లో 24 బయోమెట్రిక్స్ డివైజ్‌లకు 11 మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. వీటి ద్వారానే ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు ఉన్నారు.

నిమజ్జనం ఘాట్ పరిశీలన



నకరికల్లు: పోలీసు శాఖ కేటాయించిన ప్రదేశాల్లోనే విగ్రహాల నిమజ్జనం చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపారు. మండలంలోని అడ్డ రోడ్డు వద్ద గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జనం ఘాట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, మార్కింగ్ చేసిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీలు నిమజ్జనం తేదీని ముందుగా తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది ఉన్నారు.

అనాథశ్రమంలో అన్నదానం



క్రోసూరు: స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో శుక్రవారం వట్టి చెరుకూరు ఎంపీపీ చిలక సుబ్బారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు, సత్తెనపల్లిలోని అనాథ ఆశ్రమాల్లో అన్నదానం చేశారు.

సేంద్రియ ఎరువులతో మేలు



రాజుపాలెం: వేప గింజల కషాయాన్ని రైతులు తయారు చేసుకుని పంటపై పిచికారీ చేయడం వల్ల పురుగు మందుల వాడకం తగ్గించవచ్చునని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య తెలిపారు. కోట నెమలిపురి సమీపంలో పొలం బడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా సేంద్రియ ఎరువులను వాడకాన్ని పెంచి, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వీఏఏ జి.జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



నార్నెపాడు(ముప్పాళ్ళ): సాగు చేసిన ప్రతి పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ఎం.భవాని శంకర్ తెలిపారు. నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న పంటల నమోదు తీరును శుక్రవారం పరిశీలించారు. భూ యజమాని వివరాలు, సర్వే నంబరు, పంట వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. తుపాను కారణంగా పంట నష్టం జరిగితే వివరాలు నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ, వీఆర్వో రైతులు ఉన్నారు.

విరాళాలు సేకరణ

వినుకొండ(నూజెండ్ల): సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలో విరాళాలు సేకరించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ సుమారు రూ.20,500లు విరాళాలు సేకరించి పంపినట్లు తెలిపారు.

• మునిగిన పంట.. బరువెక్కిన గుండె

నీటిలో పత్తి పంటను చూస్తుంటే.. రైతన్నల కంట కన్నీటి చుక్కలు రాలుతున్నాయి. పాటిబండ్ల, కంభంపాడు, బలుసుపాడు, పరస, లింగంగుంట్ల గ్రామాల్లో పంట నీటిలో తేలాడుతూ.. అన్నదాత గుండెను బరువెక్కిస్తోంది. పేరమ్మ వాగు పరీవాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల పంట వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. నీరు బయటకు పంపే మార్గం లేకపోవడంతో చేసేదేమి లేక హలధారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంభంపాడులో పత్తి పంట పూర్తిగా నీటిలోనే ఉంది.

– పెదకూరపాడు



కంభంపాడు వద్ద నీటిలో పత్తి పంట



బలుసుపాడు గ్రామంలో నీట మునిగిన పత్తి సాగు



పాటిబండ్ల వద్ద ఎండుముఖం పట్టిన పత్తి పంట

పౌష్టికాహారంతో రక్త హీనత నివారణ

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ

బెల్లంకొండ: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్త హీనత నివారించవచ్చని మాచాయపాలెం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. శుక్రవారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పోషణ అభియాన్, వ్యాధి నిరోధక టీకాలపై తల్లులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భిణులు సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల బిడ్డ ఎదుగుదల తగ్గి, అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారు చేసుకోవడంపై అవగహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ విజయశాంతి మాట్లాడుతూ రక్త హీనత అధిగమించడానికి గర్భిణులు తాజా కూరగాయలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, రాగిపిండి జావ తాగాలని సూచించారు. ఐరన్ మాత్రలు, బాలామృతం, పప్పు చెక్క, బెల్లం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు, స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల అన్నారు. పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామంలో నిర్వహించిన పోషణ్ అభియాన్‌లో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ప్రమీల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాతాశిశు మరణాల నియంత్రణ, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నల్లబోతు శాంతి, టి.జయలక్ష్మమ్మ, ఎం.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నకరికల్లు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవచవరం మిద్దె సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు..ద్విచక్ర వాహనాలు వేగంగా ఢీ కొట్టగా నకరికల్లుకు చెందిన కండ్లకుంట వెంకటేష్(23) తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న నకరికల్లుకు చెందిన షేక్ బాజీ, అతని వెనుక ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఘటన స్థలంలో వెంకటేష్ మృతదేహం

ఫోన్ పే బురిడీ..

ముప్పాళ్ళ: 'నీకు మా వాళ్లు ఫోన్ పే చేస్తారు... అర్జంట్‌గా నాకు డబ్బులు కావాలి.' అంటూ ఓ వ్యక్తి దుకాణదారుడి ఖాతాకు డబ్బులు వేయించాడు. అతని నుంచి నగదు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. అనంతరం కొంత సమయం తర్వాత 'మీ ఖాతాలోకి పొరపాటున డబ్బులు వచ్చాయి.. వెనక్కి పంపకుంటే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తాం.' అంటూ దుకాణ దారుడికి ఫోన్ పే చేసిన నంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాము పోలీసులని చెప్పి భయపెట్టి ఆ నగదు వెనక్కి తీసుకున్న ఘటన మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బూర్లగడ్డ విశ్వనాథం గ్రామంలో దుకాణంతో పాటుగా, మీ-సేవ కేంద్రాన్ని నిర్వహిస్తుంటాడు. గురువారం పల్లెటూరు వ్యక్తి లా ఓ వ్యక్తి లుంగీ ధరించి దుకాణం వద్దకు వచ్చాడు. తనది పక్కనే ఉన్న తొండపి గ్రామమని, తన బంధువు ఫోన్ పే చేస్తారని, తనకు నగదు అత్యవసరమని నమ్మించాడు. అనంతరం దుకాణదారుడికి రూ.40 వేలు ఫోన్‌పే చేయించాడు. అంత డబ్బులు లేవని, రూ.30 వేలు మాత్రమే ఉన్నాయని దుకాణదారుడు చెప్పినప్పినప్పటికీ వినకుండా.. ఉన్న వరకు ఇవ్వండి, మిగిలినవి రేపు వచ్చి తీసుకుంటానని దుకాణదారుడి నుంచి రూ.30 వేలు తీసుకొని ఉడాయించాడు. కొద్ది సేపటి తర్వాత దుకాణ దారుడికి ఫోన్ పే చేసిన నంబరు నుంచి ఓ మహిళ ఫోన్ చేసింది. పొరపాటున నగదు ఫోన్ పే చేశామని, తిరిగి పంపించాలంటూ చెప్పింది. తాము పోలీసులమని, డబ్బులు వెనక్కి పంపకపోతే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ మరో వ్యక్తి ఫోన్‌లో బెదిరించాడు. దీంతో దుకాణదారుడు విశ్వనాథం రూ.40వేలు వెనక్కి పంపించాడు. అనంతరం తనని మోసం చేశారంటూ అతను ముప్పాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సంతకం పెట్టలేదని రైతు నిరసన

- పొలానికి విద్యుత్ కనెక్షన్ కోసం తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొన్న రైతు
- ఎస్ఐ జోక్యంతో ముగిసిన వివాదం

ఈపూరు: రెవెన్యూ అధికారులు తమ పద్ధతులను ఏ మాత్రం మార్చుకోవడం లేదు. రైతులను తమ కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోవడం అలవాటుగా మారింది. దీనికి నిదర్శనం ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన రైతు కంచేటి చంద్రరావుది ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చంద్రరావు చిట్టాపురం రెవెన్యూ పరిధిలోని ఎల్‌పీ నం. 206లో 2.90 ఎకరాల భూమి కలదు. అయితే ఆ భూమిలో విద్యుత్ కనెక్షన్ కోసం శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి తహసీల్దార్ సంతకం కోసం రాగా ఎంక్వయిరీ కొరకు తహసీల్దార్ నళిని వీఆర్వో నబిని పంపింది. అయితే గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి వివరాలు నమోదు చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరాలు అందించినప్పటికీ తహసీల్దార్ నళిని 5గంటలు దాటిన తరువాత నేను సంతకాలు పెట్టనని ససేమిరా అని కారులో తహసీల్దార్ బయలుదేరుతుండటంతో అందుకు ఆగ్రహించిన రైతు కంచేటి చంద్రరావు గేటుకు అడ్డంగా కూర్చొని కారును పోనివ్వనని నిర్సన తెలిపారు. సుమారు అరగంట సేపు నిరసన వ్యక్తం చేశారు. నన్ను మధ్యాహ్నం నుంచి కార్యాలయంలో వేచి ఉంచి ఇప్పుడు 5గంటలు దాటింది సంతకాలు పెట్టనని అనడం ఏమిటని ఆయన ఆరోపించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు అక్కడికి చేరుకొని చంద్రరావు నిరసనను విరమింపజేసి ఇరువురి మధ్య సయోధ్య కుదుర్చడంతో అప్పుడు తహసీల్దార్ నళిని చంద్రరావు దరఖాస్తుపై సంతకాలు పెట్టింది.



కారుకు అడ్డంగా కూర్చున్న రైతు కంచేటి చంద్రరావు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ముప్పాళ్ళ: వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్లలో శుక్రవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీసీ వర్గీయులు వినాయక మండపం ఏర్పాటు చేశారు. మండపానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించే క్రమంలో మండపానికి ఉన్న ఇనుప కడ్డీకి విద్యుత్ సరఫరా కావడంతో దాన్ని పట్టుకున్న ఈర్ల చినలక్ష్మయ్య(45) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో అక్కడ ఉన్న వారంతా పరుగులు తీశారు. మండపం వద్దే ఉన్న బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

అనంతవరం(క్రోసూరు): మహిళల్లో ఐరన్ లోపం తలెత్తకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రత్నకుమారి తెలియజేశారు. శుక్రవారం అనంతవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు ఐరన్ లోపం నివారణపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ వర్కర్లు బి.జయలక్ష్మి, సీహెచ్ లక్ష్మి, పి.ప్రసన్నరాణి, మహిళా పోలీసు కె.అబిజ్ఞ, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

క్రోసూరు: మండలంలోని బాలెమర్రు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ నాగేంద్రరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సయ్యద్ ఆదాం సాహెబ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 35 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆదాం సాహెబ్ పై ఇప్పటికే రెండు కేసులున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన అక్రమ మద్యం, గుట్కాలు, గంజాయి విక్రయిస్తున్నట్లు పేకాట నిర్వహిస్తున్న సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

చిలకలూరిపేట: స్కూటీల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అర్బన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అర్బన్ సీఐ పి రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురంకు చెందిన కత్తి శివ, క్రీస్తు కాలనీకి చెందిన తన్నీరు ఉమా శంకర్, పెదనందిపాడు రోడ్డులో నివాసం ఉండే ఒంటిపులి నరేంద్రబాబు గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు మూడు వాహనాలపై అనుమానాస్పదంగా చిక్కారు. మొత్తం ఎనిమిది స్కూటీలు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పాల్గొన్న పట్టణ ఎస్ఐ డి చెన్నకేశవులు, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఈపూరు: అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ముప్పాళ్ల గ్రామంలో రేషన్‌షాపుకి చెందిన వాహనంలో బియ్యం బస్తాలు డి.సురేష్‌కు చెందిన ఇంటికి చేరవేసినట్లు గ్రామస్తులు వీఆర్‌వో ఎస్‌కే అబ్దుల్ నబికి సమాచారం అందించారు. వీఆర్ఏ జాన్‌సైదాతో కలిసి తనిఖీ చేయగా 36 పీడీఎస్ బియ్యం బ్యాగులు గుర్తించారు. డీలర్ కె.శ్రీనివాసరావుకు చెందినవనిగా గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వీఆర్‌వో తెలిపారు.

ఇంటింటి జ్వర సర్వే..

రాజుపాలెం: మండలంలో భారీగా వర్షాలు పడుతున్నందున ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గణపవరం, మొక్కపాడు, కొండమోడు గ్రామాల్లో జ్వరాలపై ఇంటింటా సర్వే శుక్రవారం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగును తొలగించుకోవాలని సూచించారు. మురుగు నిల్వ ఉన్న చోట ఎబెట్, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రావాలని సూచించారు. సర్వేలో ఎంఎల్‌హెచ్‌పీలు శివమాధవి, అన్నాకుమారి, లక్ష్మీ దుర్గ, శిరీషా బాయి, ఏఎన్‌ఎంలు శారద, నాగమణి, మేరీ, ధనలక్ష్మి, నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



నిల్వనీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

సత్తెనపల్లి: వినాయక చవితి ఉత్సాహం వాడవాడలా వెల్లి విరుస్తోంది. పర్యావరణ హితమే లక్ష్యంగా అనేక స్వచ్ఛంద సంస్థలు శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. డీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దరువూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని రఘురాం నగర్‌లో 600, ప్రధాన్ రహదారిలోని తాలూకా సెంటర్ లో 900 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రకృతి హితమే పండుగల పరమార్థమన్నారు. అందరూ మట్టి గణపతులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కొల్లా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి ఏర్పాట్లు..

క్రోసూరు: వినాయక చవితి ఉత్సవాలకు మండపాలు సిద్ధమయ్యాయి. శనివారం పండగ నిర్వహణకు భక్తులు గణనాథుడి విగ్రహాలను నెలకొల్పారు. గ్రామాలు, పట్టణాలు సందడి వాతావరణం నెలకొంది. లంబోదరుడి తొ..



తాలూకా సెంటర్‌లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



క్రోసూరులో భక్తులు ఏర్పాటు చేసిన గణనాథుడు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రాజుపాలెం: మండలంలోని కొండమోడు ఇసుక డంపింగ్ యార్డు నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఇసుక డంపిగ్ యార్డు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. తహసీల్దారు దుర్గేష్‌రావు రాత్రింబవళ్లు ఆరుగురు సిబ్బందిని ఉంచి, పర్యవేక్షిస్తున్నారు. ఈ సిబ్బంది రోజుదులు ఉంటేనే ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలలోపే ఇసుక లోడ్ చేయాలి. ఇటీవల కాలంలో రాత్రిళ్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు ఆగమేగాల మీద వీఆర్ఏను సస్పెండ్ చేసి, చేతులు దులుపుకున్నారు. వీఆర్ఏతో పాటు పనిచేసే ఉన్నతాధికారులకు సోకాజ్ నోటీసులు ఇచ్చి సరిపుచ్చుకున్నారు. దీంతో తహసీల్దారును ఉన్నతాధికారులను కాపాడారని పలు ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికై జిల్లా అధికారులు అసలైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటే చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: కరాటే ఇంటర్ స్టేట్ చాంపియన్ షిప్‌లో సత్తెనపల్లి విద్యార్థులు సత్తాచాటారు. ఒంగోలులోని మహా లక్ష్మి ఫంక్షన్ హాలులో కరాటే ఇంటర్ స్టేట్ చాంపియన్ షిప్ ఈ నెల 1న జరిగింది. సత్తెనపల్లికి చెందిన 'షీకోకాయ్ షిటోరియో' కరాటే స్కూలు విద్యార్థులు 13 మంది విజేతలుగా నిలిచారు.

వ్యక్తిగత బాలికల కటా విభాగం:

టి.నిఖిత (13 సంవత్సరాలు, గోల్డ్), బి.అక్షయ రెడ్డి (10 సం.,గోల్డ్), ఎస్.శరణ్య (13సం., సిల్వర్), ఎన్.ఎస్.జాహ్నవి(8 సం., సిల్వర్), పి.పూజిత(9 సం.,సిల్వర్) ప్రతిభ చాటారు.

వ్యక్తిగత బాలుర కటా విభాగం:

డీఎంఎస్ రామబ్రహ్మాచారి (15సం., గోల్డ్), ఎంబీ బాలాజీ (11సం., గోల్డ్) ఎల్. గేష్ను(10సం., గోల్డ్), ఎల్.కిరీట్ (11సం., గోల్డ్), కె.తేజ ప్రకాష్ (11 సం., గోల్డ్), బి.సత్యన్నారాయణ (10సం., గోల్డ్), టీఎన్ నితీష్ నాయుడు(9 సం., సిల్వర్), ఎస్ఎంఎస్ దినేష్ (8 సం., సిల్వర్) సాధించారు. షిహాన్ అనుముల రాంబాబు, అనుముల రామయ్య ప్రత్యేకంగా అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో షిహాన్ అనుమల రాంబాబు

• పందుల గుంపు.. వ్యాధుల ముప్పు

క్రోసూరు: మండల కేంద్రంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై, ఇళ్ల మధ్యలో వీడి బెడద ఎక్కువై పోయిందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రస్తుత తరుణంలో, జ్వరాలు, కీళ్ల నొప్పులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతుంటే.. ఈ పందుల గోల ఏంటని అసహనం వ్యక్తపరుస్తున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలంటూ ఊదగొడుతున్న అధికారులు వీటి విసయంలో ఉదారంగా వ్యవహరించడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాజమహేంద్రవరంలో పోట్లూరి విద్యార్థి మృతి

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థులు ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాలు మేరకు పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన చింతా కార్తీక్ (పోట్లూరు) తన స్నేహితుడు రోణింగి ప్రవీణ్ కుమార్‌లు (శ్రీకాకుళం) రాజమండ్రిలోని గైట్ కళాశాలలో చదువుతున్నారు. కళాశాల నుంచి జాతీయ రహదారి మార్గంలో బైకుపై టిఫిన్ చేయటానికి బయలు దేరారు. మార్గమధ్యంలో తమిళనాడు రాష్ట్రం నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ అతి వేగంతో బైకును వెనుక నుంచి ఢీకొట్టటంతో ఇరువురు బీ విద్యార్థులు జాతీయ రహదారి మార్గంలో మృత్యువాత పడ్డారు. చింతా కార్తీక్ (19) బిటెక్ రెండవ సంవత్సరం (సీఎస్‌సీ) చదువుతున్నాడు. చింతా వీరాంజినేయులు-రాధ దంపతులకు ఇరువురు సంతానం కాగా అందులో రెండవ సంతానం కార్తీక్. వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. శవపంచనామా అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. చింతా కార్తీక్ అకాల మృతికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు స్నేహితులు, కన్నీటి పర్యంతమయ్యారు.



ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం

నరసరావుపేట ఈస్ట్: వైద్యసేవలో ఫిజియోథెరపీ విభాగానికి ప్రత్యేక స్థానం ఉందని పలువురు వక్తలు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో శుక్రవారం ఫిజియోథెరపీ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఫిజియో ప్రిన్సిపల్ వేణుగోపాలరెడ్డి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ బి.వేమారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఫిజియో కళాశాల ఏఓ ఏవీఎస్.గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విద్యార్థికి ఆర్థిక సాయం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మారెళ్లవారిపాలేనికి చెందిన పరంజ్యోతి అనే విద్యార్థి యూకే లోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో ఎంఎస్ సీట్ సాధించాడు. వినుకొండలోని థెరిస్సా సేవా సొసైటీ ఫౌండర్ నాగవాణి శుక్రవారం పట్టణ సీఐ శోభన్‌బాబు చేతుల మీదుగా లక్ష రూపాయలు చెక్కును పరంజ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థినిని అభినందించారు.